ప్రజాశక్తి
మంగళవారం 15 ఏప్రిల్ 2025
I
అల్లూరి సీతారామరాజు



ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తే చర్యలు

ప్రజాశక్తి-చింతపల్లి: మండల కేంద్రంలోని సంత బయలు నుంచి పాత బస్టాండ్ కూడలి, రంగా సెంటర్, మండల పరిషత్ కార్యాలయం, టీ జంక్షన్ వరకు రహదారికి ఇరువైపులా స్థానిక వ్యాపారస్తులు వివిధ రకాల సామగ్రి ఏర్పాటు చేసి ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తే చర్యలు తీసుకుంటామని చింతపల్లి ఎస్సై వెంకటరమణ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ,ముత్యాలమ్మ అమ్మవారి జాతర మహోత్సవం పురస్కరించుకొని స్థానిక వ్యాపారస్తులు ప్రధాన రహదారికి ఇరువైపులా వివిధ రకాల సామాగ్రి ఏర్పాటు చేయడంతో ట్రాఫిక్ అంతరాయం కలిగి వాహనదారులు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని ఆయన అన్నారు. ప్రధాన రహదారిపై ట్రాఫిక్ అంతరాయం ఏర్పడితే స్థానిక వ్యాపారస్తులే పూర్తి బాధ్యత వహించవలసిన ఉంటుందన్నారు.



వ్యాపారులతో మాట్లాడుతున్నపోలీసులు

బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి అంబేద్కర్

- కలెక్టర్ దినేష్ కుమార్ - ఘనంగా అంబేద్కర్ జయంతి వేడుకలు



పాడేరులో నివాళి అర్పిస్తున్న కలెక్టర్, ఎంపి

ప్రజాశక్తి-పాడేరు: బడుగు బలహీన వర్గాల అభ్యున్నతే ధ్యేయంగా అందరూ కృషి చేయాలని జిల్లా కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్ పిలుపునిచ్చారు. అంబేద్కర్ ఆశయ సాధనకు మనందరం కలిసి కృషి చేద్దామన్నారు. సోమవారం డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ 134వ జయంతిని పురస్కరించుకుని స్థానిక పాత బస్టాండ్ కూడలి వద్ద ఉన్న అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, అంబేద్కర్ గొప్ప రాజకీయవేత్త, సామాజిక సంస్కర్త, న్యాయవాది, ఆర్థికవేత్త అని కొనియాడారు. భారత రాజ్యాంగాన్ని రూపొందించడంలో ఆయన ముఖ్యమైన పాత్ర పోషించినందున ఆయనను భారత రాజ్యాంగ పితామహుడిగా కూడా పిలుస్తారని తెలిపారు. అంబేద్కర్ మన సమాజానికి చేసిన కృషికి 1990లో భారతరత్న అవార్డుతో సత్కరించబడ్డారని తెలిపారు. వివక్షకు వ్యతిరేకంగా పోరాటం చేయటానికి, సామాజిక న్యాయం, సమానత్వంపై తన జీవితాన్ని అంకితం చేసిన గొప్ప వ్యక్తి అంబేద్కర్ అని కొనియాడారు.ఆయన మనందరికీ గొప్ప ప్రేరణ, స్ఫూర్తి అని ఆయన మార్గదర్శకంలో మనందరం కుల మత వివక్షకు తావు లేకుండా పని చేద్దాం అని సూచించారు.

అరకు ఎంపీ డాక్టర్ తనూజ రాణి మాట్లాడుతూ, మహిళలు సాధికారత సాధించాలని అంబేద్కర్ చెప్పిన మాటలు ఎల్లవేళలా గుర్తుంచుకొని మహిళా అబివృద్ధి సాధించాలన్నారు. అటువంటి మహానుభావులను జయంతి రోజునే కాకుండా జీవితాంతం గుర్తుంచుకోవాలని సూచించారు.

ఎస్పి అమిత్ బర్దర్ మాట్లాడుతూ, అంబేద్కర్ ఆశయ సాధన లో భాగంగా ముక్త పదార్థాలు లేని సమాజం ఏర్పడాలని, అందుకు ఏజెన్సీలో గంజాయిని జీరో స్థానానికి తీసుకువెళ్లాలని సూచించారు. అంతకు ముందు ఐటిడిఎ కార్యాలయం నుండి అంబేద్కర్ కూడలి వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సబ్ కలెక్టర్ సౌర్యమన్ పటేల్, ఏఎస్పి ధీరజ్, మాజీ శాసనసభ్యురాలు గిడ్డి ఈశ్వరి, బి.నాగరాజు, గిరిజన సంక్షేమ శాఖ డిడి ఎల్.రజని, డి ఆర్ డి ఏ పిడి వి మురళి, సాంఘిక సంక్షేమ శాఖ డిడి జనార్దన్‌రావు, బి ఏఎంసిఈఎఫ్ జిల్లా అధ్యక్షులు బి దిలీప్ కుమార్, జిల్లా సమన్వయకర్త సిహెచ్ మేనక, రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ సభ్యులు పి కిరణ్, కె. మంజుల వల్లి, డాక్టర్ కే సుధాకర్ పాల్గొన్నారు.

అరకులోయ: మండల కేంద్రంలో భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ 134వ జయంతి వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం, మాట్లాడుతూ, బడుగు బలహీనవర్గాల ఆశ జ్యోతి డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ అన్నారు.

ఆదివాసి గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కిల్లో సురేంద్ర మాట్లాడుతూ, భారత రాజ్యాంగం పరిరక్షించడం ద్వారానే చట్టాలు, హక్కులు రక్షించబడ తాయన్నారు. టూరిజం అభివృద్ధి పేరుతో గిరిజనుల భూములు బడా పెట్టుబడిదారులకు అప్పగించడానికి 1/70 చట్టం నిర్వీర్యం చేసే కుట్ర పన్ను తున్నారన్నారు.జీవో నెంబర్ 3 పునరుద్ధరించాలని, హైడ్రో పవర్ ప్రాజెక్ట్ నిలుపుదల చేయాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో జడ్పిటిసి శెట్టి రోషిని, ఎంపిపి ఉషారాణి, ఆదివాసి గిరిజన సంఘం నాయకులు పొద్దు బాలదేవ్, రామారావు, జగన్నాథం, హరి,మగ్గన్న, సిఐటియు జిల్లా కార్యదర్శి ఉమామహేశ్వరరావు, అంబేద్కర్ సేవా సంఘం ప్రతినిధులు, వైఎస్ఆర్సిపి మండల అధ్యక్షుడు రామ్మూర్తి, నాయకులు కమిడీ అశోక్ కుమార్, శెట్టి అప్పాలు, ఎంపిటీసీ దుర్య ఆనంద్ కుమార్, పాంగి చిన్నారావు, కాంగ్రెస్ నాయకులు పి.శాంత కుమారి, పి.చిన్నస్వామి, జనసేన నాయకులు చిరంజీవి, మధు, రఘునాథ్, పెద్దలబుడు సర్పంచ్ పెట్టేలి దాసు బాబు, ఈవో రాజ్ కుమార్, ఎంఈఓ వి. త్రినాథ్‌రావు నివాళులర్పించారు.



అరకులోయలో మాట్లాడుతున్న కిల్లో సురేంద్ర

రాజ్యాంగ పరిరక్షణకు ఉద్యమించాలి

- సిపిఎం జిల్లా కార్యదర్శి అప్పలనర్స

ప్రజాశక్తి-పాడేరు: భారత రాజ్యాంగ స్ఫూర్తి, పరిరక్షణకు ఐక్య ఉద్యమాలు అవసరమని ఇదే డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కు నిజమైన నివాళి అని ప్రజా సంఘాల, రాజకీయ పార్టీలకు సిపిఎం జిల్లా కార్యదర్శి పి.అప్పల నరస పిలుపు నిచ్చారు. పాడేరు సి.పి.ఎం జిల్లా కార్యాలయంలో సోమవారం అంబేద్కర్ 134వ జయంతి సందర్భంగా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం అప్పలనరస మాట్లాడుతూ, భారత రాజ్యాంగానికి విరుద్ధంగా పనిచేస్తున్న పాలకులు కేంద్రంలో ఉన్నారని, వారి విధానాలతో తీవ్ర నష్టం కలుగుతోందని, మున్ముందు ఇది మరింత తీవ్రం కానుందని తెలిపారు. ఈ పరిస్థితుల్లో భారత రాజ్యాంగాన్ని పరిరక్షించుకోవలసిన అవసరముందని తెలిపారు. ఇందుకోసం సెక్యులర్, ప్రజాస్వామ్య శక్తులు కలిసిపోరాడాల్సిన అవసరముందని పేర్కొన్నారు. పురుషులతో సమానంగా స్త్రీలకు సమాన హక్కులు కల్పించాలని ఆయన ప్రయత్నించగా నాటి పాలకులు అడ్డుపడ్డారన్నారు. ఈ చర్యతో ఆయన న్యాయశాఖ మంత్రి పదవికి రాజీనామా చేశారని తెలిపారు. దేశంలో బిజెపి ప్రభుత్వం దళితులు, మైనారిటీలు, కవులు,కళాకారుల పైనా దాడులు చేస్తోందన్నారు. చదువుకున్న యువతకు ఉద్యోగాలు లేకుండా చేసి నిరుద్యోగాన్ని పెంచుతోందని తెలిపారు. జీఓ 3 రిజర్వేషన్ సాధనకు యువత ప్రశ్నించాలని, భారత రత్న డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ స్ఫూర్తితో ఉద్యమించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కమిటీ సభ్యులు వి.దాస్, చిన్నారావు, ఆనంద్ పాల్గొన్నారు.



నివాళి అర్పిస్తున్న అప్పలనర్స, తదితరులు

క్రికెట్ విజేతలకు బహుమతుల ప్రదానం

ప్రజాశక్తి -అనంతగిరి: అంబేద్కర్ జయంతి వేడుకలను పురస్కరించుకొని మండల కేంద్రంలో ఆదివాసీ గిరిజన సంఘం,. జెడ్పిటిసి గంగరాజు ఆధ్వర్యంలో జరిగిన క్రికెట్ పోటీలలో విజేతలుగా గెలుపొందిన జట్టులకు స్థానిక జెడ్పిటిసి దిసరి. గంగరాజు, ఎంపీపీ శెట్టి . నీలవేణి బహుమతులు ప్రదానం చేశారు.మొదటి బహుమతి రూ 20 వేలు, రెండవ బహుమతి రూ.10. వేలు అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, క్రీడ రంగంలో యువత ఆసక్తి చూపాలన్నారు.ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ సోమ్మెల, టోకూరు సర్పంచ్ కిల్లో. మోసియా, సిపిఎం నాయకులు ఎస్ నాగులు, జి. దేవన్న, ఉప సర్పంచ్, వైసీపీ మండల నాయకులు కె సూరి, టిడిపి నాయకులు రంజిత్ తదితరులు పాల్గొన్నారు



బహుమతులు ఇస్తున్న జెడ్పిటిసి గంగరాజు

సీలేరు జెన్‌కో కాంప్లెక్స్‌లో ప్రాజెక్టుల పనితీరుపై అధ్యయనం

విద్యుత్‌శాఖ ఓఎస్‌డి సుడిగాలి పర్యటన



సీలేరు డ్యాం పరిశీలనలో ఓఎస్‌డి సాంబశివరావు

ప్రజాశక్తి -సీలేరు: సీలేరు కాంప్లెక్స్‌లో రాష్ట్ర విద్యుత్‌శాఖ మంత్రి కార్యాలయ ఓఎస్‌డి ఎవి సాంబశివరావు సోమవారం సుడిగాలి పర్యటన చేశారు. ముందుగా కాంప్లెక్స్ పరిధిలోని మాచ్‌ఖండ్ జలవిద్యుత్ కేంద్రానికి చేరుకుని పరిశీలించారు. జల విద్యుత్ కేంద్రంలో విద్యుత్ ఉత్పత్తి యూనిట్లు పనితీరు తదితర అంశాలపై ఎపిజెన్‌కో అధికారులను అడిగి ఆరాతీశారు. అనంతరం సీలేరు చేరుకుని రెగ్యులేటర్ డ్యాము గేట్లు పనితీరు పరిశీలించారు. రెగ్యులేటరీ డ్యాం వద్ద విద్యుత్ ఉద్యోగులు విధులు నిర్వహిస్తున్న కంట్రోల్ రూమ్ పరిశీలించారు. జొన్నమామిడి వద్ద పంపు స్టోరేజ్ ప్రాజెక్టు డంపింగ్ యార్డ్‌కు కేటాయించిన స్థలాన్ని పరిశీలించారు. పార్వతినగర్ సమీపంలో పంపు స్టోరేజ్ ప్రాజెక్టు నిర్మాణాన్ని కేటాయించిన స్థలాన్ని ప్రాజెక్టు మ్యాప్‌ను క్షుణ్ణంగా పరిశీలించారు. ప్రాజెక్టు ప్లానింగ్ తదితర అంశాలపై ఎస్ఇ చంద్రశేఖర్ రెడ్డితో చర్చించారు. అనంతరం స్థానిక జలవిద్యుత్ కేంద్రాన్ని చేరుకొని యూనిట్లను పరిశీలించి వాటి పనితీరు అడిగి తెలుసుకున్నారు. విద్యుదుత్పత్తి రోజుకు ఏమేరకు జరుగుతుంది తదితర అంశాలపై ఆరా తీశారు. రెగ్యులేటరీ డ్యాం నుంచి సీలేరు జల విద్యుత్ కేంద్రానికి నీటి విడుదల చేసే గేట్లు పనితీరు ఎస్‌సి సివిల్స్ చంద్రశేఖర్ రెడ్డిని అడిగి తెలుసుకున్నారు.

రాష్ట్ర విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ తన కార్యాలయంలో ఓఎస్‌డిగా విశ్రాంత ఎస్ఇ కెవి.సాంబశివరావును నియమించారు. సీలేరు కాంప్లెక్స్‌లో ప్రాజెక్టులు పనితీరు తదితర అంశాలపై అధ్యయనం చేయమని మంత్రి ఆదేశాలతో పర్యటనకు వచ్చారు. కార్యక్రమంలో ఎపి జెన్‌కో ఇఇ శ్రీనివాసరెడ్డి, జెన్‌కో కార్మికులు, సెక్యూరిటీ సిబ్బంది పాల్గొన్నారు.

పాలగెడ్డ రహదారి నిర్మించాలని తీర్మానం




పంచాయతీ కార్యదర్శికి తీర్మాన పత్రాలను అందజేస్తున్న పలుపార్టీల నేతలు

ప్రజాశక్తి -సీలేరు: జీకే వీధి మండలం ఆర్‌వి నగర్ నుంచి పాలగెడ్డ వరకు ఆంధ్రా, తెలంగాణ, ఒడిశా అంతరరాష్ట్ర రహదారి పనులు తక్షణమే చేపట్టాలని సోమవారం దుప్పిలివాడ, ధారకొండ పంచాయతీ కేంద్రాల్లో నిర్వహించిన గ్రామసభలో స్థానికులు తీర్మానించారు.

దుప్పిలవాడలో తీర్మాన పత్రాలను జనసేన మండల ఉపాధ్యక్షుడు బత్తుల సిద్ధార్థ మార్క్ రాజుకు అందజేశారు. అలాగే ధారకొండలో రాజకీయాలకు అతీతంగా గ్రామసభ నిర్వహించి, తీర్మానాలను పంచాయతీ కార్యదర్శి రాజ్యలక్ష్మికి అందజేశామని పీసా అధ్యక్ష కార్యదర్శులు చిట్టిబాబు, చెట్టి రాంబాబు సిపిఎం నేత బాకూరి కోటీశ్వరరావు తెలిపారు.ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో నేతలు మాట్లాడుతూ ఆర్‌వినగర్ పాలగెడ్డ రహదారి గోతులమయంగా మారి వర్షపు నీరు చేరి చెరువుల్ని తలపిస్తుందని, ఎప్పుడు ఎటువంటి ప్రమాదం ముంచుకొస్తుందో తెలియని పరిస్థితి నెలకొందని ఆందోళన చెందారు. ఈ రోడ్డు బాగుచేయాలని ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా అధికారులు స్పందించడం లేదని వాపోయారు దుప్పిలివాడలో సర్పంచి కేలేబు కుమారి, టిడిపి నేత మాధవ్, సొన్ను , కార్యదర్శి శివాజీ, విఆర్ఒ, సచివాలయ సిబ్బంది, ధారకొండలో కిలో ధర్మారావు, మోహన్, శోభ, జగన్, సతీష్ దొర, రామకృష్ణ పాల్గొన్నారు.

నిలిచిన బిఎస్ఎన్ఎల్ సేవలు



ఎస్ఐకి వినతిపత్రం ఇస్తున్న వినియోగదారులు

ప్రజాశక్తి- కొయ్యూరు : మండలంలోని మంప గ్రామంలో పదేళ్ల కితం నిర్మించిన బిఎస్ఎన్ఎల్ టవర్ తరచూ, సాంకేతిక లోపంతో, సిగ్నల్స్ అందుబాటులోకి రావడం లేదు. యూజర్లు ఎన్నో డబ్బులు పెట్టుకొని, బిఎస్ఎన్ఎల్ ఆఫర్లు వేయించుకున్నా, నెలలో కనీసం సగం రోజులైనా సిగ్నల్ లేక ఇబ్బందులు పడుతున్నామని వినియోగదారులు వాపోతున్నారు. అధికారులు వెంటనే స్పందించి బిఎస్ఎన్ఎల్ సేవలు పునరుద్ధరించే చర్యలు చేపట్టాలని కోరుతున్నారు. ఈ మేరకు ఎస్ఐకి వినతిపత్రం అందజేసి, సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని కోరారు.

మృతదేహాలు లభ్యం

ప్రజాశక్తి -అనంతగిరి: మండలంలోని జీనబాడు పంచాయతీ పరిధి సరియా జలపాతంలో ఆదివారం గల్లంతైన ఇద్దరు యువకుల మృతదేహాలు లభ్యమయ్యాయి. ఆరుగురి స్నేహితులతో కలిసి ఇద్దరు ఆదివారం సరియా జలపాతంలో సందర్శించారు. ఆ క్రమంలో ఇద్దరు యువకులు ప్రమాదవసత్తు ఊబిలోకి గల్లంతయ్యారు. వారిని రక్షించేందుకు తోటి స్నేహితులు ప్రయత్నించినప్పటికీ సాధ్యం కాలేదు. విశాఖ పట్నం పాత పూర్ణ మార్కెట్ రెల్లి వీధి ప్రాంతానికి చెందిన నరసింహ(24) వాసు (21) ఎస్ రాయవరం నివాసిగా పోలీసులు గుర్తించారు.గజ ఈతగాళ్ల గాల్లను రపించి ఊబిలోని మృతదేహాలను తీశారు పోస్టుమార్టం నిమిత్తం ఎస్ కోట ఏరియా ఆసుపత్రికి తరలించినట్లు సీఐ హిమగిరిరావు తెలిపారు.



ప్రారంభిస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్, ఎంపీ తనుజారాణి

ఎస్‌బిఐ సహకారంతో వాటర్ ప్లాంట్ ఏర్పాటు

ప్రజాశక్తి-పాడేరు టౌన్: అల్లూరి జిల్లా కేంద్రం పాడేరులో జిటిడబ్ల్యు పోస్ట్ మెట్రిక్ హాస్టల్ (బాలికలు)లో స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సహకారంతో ఏర్పాటు చేసిన ఆర్వో మినరల్ వాటర్ ప్లాంట్‌ను సోమవారం అరకు ఎంపి జి.తనుజారాణి, జిల్లా కలెక్టర్ ఎఎస్.దినేష్ కుమార్ ప్రారంభించారు. రూ.లక్షా యాభైవేలతో ఏర్పాటు చేసిన ఆర్వో మినరల్ వాటర్ ప్లాంట్‌ను ఎంపి, కలెక్టర్ లాంఛనంగా ప్రారంభించారు.

అంతకుముందు హాస్టల్లో ఏర్పాటు చేసిన అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. బడుగు బలహీన వర్గాల అభివృద్ధికి ఉద్యమించిన గొప్ప వ్యక్తి అని ఆయనను నేటితరం ఆదర్శంగా తీసుకొని ముందుకెళ్లాలన్నారు. పేదలందరికీ అండగా, ప్రజలందరికీ సుస్థిర రాజ్యాంగాన్ని డాక్టర్ డా.బి.ఆర్ అంబేద్కర్ దేశానికి అందించారని అన్నారు. ఈ సందర్భంగా ఎస్ బిఐ ప్రతినిధులకు ఎంపి, కలెక్టర్, విద్యార్థులు, ప్రజలు అభినందించారు. ఈ కార్యక్రమంలో సబ్ కలెక్టర్ సౌర్యమన్ పటేల్, టిడబ్ల్యు డిడి ఎల్.రజని, ఎస్ బిఐ ప్రతినిధులు చెట్టి.వికాస్, రమణబాబు, హెచ్ డబ్ల్యుఒలు సువర్ణ, శేషకుమారి, కనక, అరుణ, తదితరులు పాల్గొన్నారు.

రోడ్లు, డ్రెయినేజీలకు శంకుస్థాపన

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్: మున్సిపాలిటీలో అభివృద్ధి కార్యక్రమాలలో భాగంగా సోమవారం 25వ వార్డులో సీ రోడ్లు, డ్రైన్లు నిర్మాణానికి టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చింతకాయల విజయ్, కౌన్సిలర్ పద్మావతి, 25వ వార్డు కౌన్సిలర్ చింతకాయల రాజేష్‌లు శంకుస్థాపన చేశారు. అనంతరం చింతకాయల విజయ్ మాట్లాడుతూ, వార్డులో ఎటువంటి సమస్యలు లేకుండా కౌన్సిలర్లు రాజేష్, పద్మావతి సమన్వయంతో ప్రణాళికలు రూపొందించారని చెప్పారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు, ఇతర వార్డుల కౌన్సిలర్లు పాల్గొన్నారు.

పోలవరం ప్రాజెక్టు నిర్మాణ పనుల్లో ప్రమాదం


ఒడిశా వలస కార్మికుని దుర్మరణం

- బాధిత కుటుంబానికి రూ.కోటి పరిహారమివ్వాలి
- ప్రమాద ఘటనపై సమగ్ర విచారణ చేపట్టాలి
- సిపిఎం జిల్లా కార్యదర్శి బొప్పెన కిరణ్

ప్రజాశక్తి- దేవీపట్నం : మండలంలో పోలవరం ప్రాజెక్టు సంబంధించి నేలకోట గ్రామం కాలువ వద్ద కటింగ్ మిషన్ వద్ద జరిగిన ప్రమాదంలో ఒడిశా వలస కార్మికుడు పరమ నాయక్ (32) మృతి చెందాడు కటింగ్ మిషన్‌పై పనిచేస్తున్న సమయంలో బ్లేడ్ విరిగి నాయక్ మెడకు గాయం కావడంతో సహచర కార్మికులు వెంటనే స్పందించి సీతానగరంకి తరలించారు అక్కడ పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతునికి భార్య ఒక పాప ఉన్నారు. పోలవరం ప్రాజెక్టు పనులకు తన సోదరుడితోకలిసి రెండు నెలల క్రితమే ఇక్కడకు వచ్చినట్లు తోటికార్మికులు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టానికి రంపచోడవరం ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ షరీఫ్ తెలిపారు.

రంపచోడవరం : పోలవరం ప్రాజెక్టు నిర్మాణ పనుల్లో భాగంగా దేవీపట్నం మండల పరిధిలో జరుగుతున్న ఇంజినీరింగ్ సైట్‌లో సోమవారం ఉదయం ప్రమాదవశాత్తుమృతి చెందిన వలస కార్మికుడు పరంనాయక్ కుటుంబానికి రూ. కోటి ఎక్స్ గ్రేషియా చెల్లించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి బొప్పెన.కిరణ్ డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో కార్మికుని మృతదేహం ఉందన్న సమాచారంతో అక్కడకు వెళ్లి, తోటికార్మికులతో ప్రమాదంపై వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కిరణ్ మాట్లాడుతూ, సోమవారం మధ్యాహ్నం 11:30గటల సమయంలో పోలవరం ప్రాజెక్టు ఇంజనీరింగ్ సైట్‌లో పనిచేస్తున్న ఒడిషాకు చెందిన వలస కార్మికుడు ఫర్మ్ నాయక్(33) పనిచేస్తున్న క్రమంలో కటింగ్ మిషన్ మెడకు తగిలడంతో అక్కడికక్కడే మృతి చెందాడని తోటి కార్మికులు చెబుతున్నారన్నారు.. ఈ సంఘటనపై పూర్తిస్థాయి విచారణ జరిపించి బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ప్రతిష్టాత్మకమైన పోలవరం ప్రాజెక్టులో నిర్మాణంలో అనేకమంది వలస కార్మికులు పని చేస్తున్నారని, వారికి కనీస జాగ్రత్తలు, భద్రత సౌకర్యాలు కరువయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు.కార్మిక చట్టాలు ఉన్నప్పటికీ, ఇతర రాష్ట్రాల నుంచి వరస కార్మికులను తీసుకొచ్చి ఇష్టనుసారంగా పనులు చేయిస్తున్నారని ఆయన అన్నారు.

పని ప్రదేశాల్లో కనీస జాగ్రత్తలు తీసుకోకుండా కూలీల మరణాలకు కారణమైన కంపెనీ బాధ్యులపై తక్షణమే కేసు నమోదు చేసి చర్యలు తీసుకోవాలన్నారు. వలస కార్మికుల చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలని, పని ప్రదేశాలలో భద్రత చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు మట్ల.వాణిశ్రీ, పల్లపు.వెంకట్, జిల్లా కమిటీ సభ్యులు కంభంశాంతి రాజు పాల్గొన్నారు.



ఆసుపత్రి వద్ద తోటి కార్మికులతో మాట్లాడుతున్న కిరణ్, ఇతర సిపిఎం నేతలు

హడలెత్తించిన పిడుగులు

- ఈదురుగాలులతో వర్ష బీభత్సం
- మేడిగట్టులో 15 పశువుల మృత్యువాత
- పలకజీడి బాలికల హాస్టల్ భవనం ధ్వంసం



మృతి చెందిన పశువులను పరిశీలిస్తున్న సిపిఎం నేతలు

ప్రజాశక్తి -ఎటపాక: మన్యంలో ఈదురుగాలులతో కూడిన భారీ వర్షం, ఉరుములు, పిడుగులు బీభత్సం సృష్టించాయి. ఆదివారం సాయంత్రం ఎటపాక మండలం రాయనపేట పంచాయతీ మేడిగట్టు గ్రామంలో పిడుగుపడి పలువురికి చెందిన 15 పశువులు మృతి చెందాయి. గాలిబీభత్సానికి పలు చోట్ల విద్యుత్ స్తంభాల నెలకొరిగాయి. దీంతో బుట్టాయిగూడెం సబ్ స్టేషన్ పరిధిలో పలు గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. విద్యుత్ అంతరాయంతో పలు గ్రామాల్లో తాగునీటి సరఫరా నిలిచిపోయింది. ఈదురుగాలులకు పలుచోట్ల నేలకొరిగాయి. జీడి,మామిడి, చింతపంటలకు తీవ్రనష్టం వాటిల్లింది. ఈదురుగాలలు, పిడుగుల బీభత్సానికి ప్రజలు అల్లాడిపోయారు.

బాధితులను పరామర్శించిన సిపిఎం బృందం

పిడుగుపాటుకు పశువులు మృత్యువాత పడిన మేడిగట్టు గ్రామాన్ని సిపిఎం ర్టీ జిల్లా కమిటీ సభ్యులు ఐవి, మండల కార్యదర్శి కాక అర్జున్, మండల కమిటీ సభ్యులు జి.హుస్సేన్‌లతో కూడిన బృందం సందర్శించింది. పశువైద్యులతో కలిసి వెళ్లి, చనిపోయిన పశువులను చూపించి, వాటికి పంచనామా చేయించారు. బాధిత గిరిజన రైతులను ప్రభుత్వపరంగా ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

హాస్టల్ భవనం పైకప్పు ధ్వంసం

కొయ్యూరు : కొయ్యూరు మండలంలో గాలివాన బీభత్సం సష్టించింది.ఈదురుగాలులతో దెబ్బకు యు. చీడిపాలెం పంచాయతీ, పలకజీడి బాలికల వసతిగృహం భవనం పైకప్పు రేకులన్నీ చెల్లాచెదురుగా ఎగిపోయాయి. ఈదురుగాలుల ఉధృతికి భవనం పైకప్పుకే వేసిన ఇనుప రాడ్లు విరిగిపోయి రేకులన్నీ ఎగిరిపోయాయని వార్డెన్ రాజేశ్వరి తెలిపారు. ఆ సమయంలో భవనంలో 20 మంది విద్యార్థులు అక్కడే ఉన్నారని, రేకులు ఎగిరిపోవడంతో విద్యార్థులు ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని పరుగులు తీశారు.



ఈదురుగాలులకు ధ్వంసమైన పలకజీడి బాలికల హాస్టల్ భవనం

ఘనంగా అంబేద్కర్ జయంతి

ప్రజాశక్తి- యంత్రాంగం

అరకులోయ రూరల్: అంబేద్కర్ స్ఫూర్తితో భారత రాజ్యాంగాన్ని కాపాడుకుందాం ఆదివాసీ గిరిజన సంఘం మండల కార్యదర్శి గత్తుం బుజ్జి బాబు అన్నారు.అరకులోయ మండలంలోని బొండం కొత్తవలసలో అంబేద్కర్ 134 వ జయంతిని ఘనంగా జరుపుకున్నారు.అనంతరం అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివలర్పించారు.ఈ సందర్భంగా ఆదివాసీ గిరిజన సంఘం మండల కార్యదర్శి గత్తుం బుజ్జి బాబు,ఆదివాసీ కళాకారుల సంఘం జిల్లా నాయకులు టి జోషి మాట్లాడుతూ,బీజేపీ ప్రభుత్వ చట్టాలు, హక్కులను కాలరస్తు ఆదివాసీ చట్టాలను సవరణలు చేస్తూ అడవిలో నివసించే గిరిజనులను అడవి నుండి గెంటేయాలని నూతన అటవీ సవరణ బిల్లును ఆమోదించిందన్నారు.ఈ కార్యక్రమంలో ఆదివాసి గిరిజన సంఘం నాయకులు గెమ్మేలి సత్యారావు, జి వెంకట్,రమణ,వార్డు మెంబర్ గెమ్మేలి రామస్వామి పాల్గొన్నారు.

అరకులోయ రూరల్:రాజ్యాంగాన్ని ఐక్య పోరాటాల ద్వారానే కాపాడుకోవాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి వి.ఉమామహేశ్వరరావు తెలిపారు. సోమవారం అరకువేలి మండలం చొంపి గ్రామంలో అంబేద్కర్ జయంతి సాగర్ రాజకుమార్ అధ్యక్షతన జరిగిన సభలో మాట్లాడుతూ, దేశంలో మత విద్వేషాలు రెచ్చగొట్టి రాజకీయంగా లబ్ధి పొందాలని ఆలోచనతో కేంద్రంలో ఉన్న బిజెపి వ్యవహరిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ముద్దినాయుడు, పిసా ఉపాధ్యక్షులు, కార్యదర్శి, దశరథ్, నూతన ప్రసాద్, ధింసా కళాకారుల సంఘం నాయకుడు పరుశురాం, సిపిఎం నాయకులు కోకేశ్వరరావు, జగన్నాథం పాల్గొన్నారు.

చింతపలి:అంబేద్కర్ జయంతి సందర్భంగా. చింతపల్లిలో గిరిజన సంఘం ఎస్ఎఫ్ఐ దళిత సంఘం ర్యాలీ నిర్వహించారు. ఆదివాసి గిరిజన సంఘం జిల్లా గౌరవాధ్యక్షులు. బోనంగి చిన్నయ్యపడాల్ మాట్లాడుతూ, స్పెషల్ డిఎస్సి ప్రకటించాలన్నారు.ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షులు. పాంగి ధనుంజయ్, మండల కార్యదర్శి సాగిన చిరంజీవి, వెంకటేష్, కాంతారావు, నాగేశ్వరరావు, నూకరాజు, రాజారావు పాల్గొన్నారు.

చింతపల్లి: అఖిల భారత గిరిజన ఉద్యోగుల సంక్షేమ సంఘం మండల అధ్యక్షుడు బౌడు గంగరాజు ఆధ్వర్యంలో మండల పరిషత్ కార్యాలయం ఎదుట ఉన్న బాబా సాహెబ్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసి ఘన నివాళులర్పించారు. స్థానిక ప్రాంతీయ ఆసుపత్రి సూపరిండెంట్ ఇంద్ర ప్రియాంక, వైద్యాధికారిణి లావణ్యలతో కలిసి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులకు రొట్టెలు, పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అఖిల భారత గిరిజన ఉద్యోగుల సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు రామకృష్ణ మాట్లాడుతూ అంబేద్కర్ కలలు కన్న సమాజం కోసం మనమందరం కలిసికట్టుగా కృషి చేద్దామన్నారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంక్షేమ కేంద్రకృత ఆశ్రమోన్నత పాఠశాల ప్రధాన ఉపాధ్యాయుడు సాగిన రామరాజు పడాల్, అఖిల భారత గిరిజన ఉద్యోగుల సంక్షేమ సంఘం అల్లూరి జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ సాగిన పూర్ణచంద్రరావు, గిరిజన ఉద్యోగుల సంఘం మండల అధ్యక్షుడు దేపూరు శశి కుమార్, అల్లూరి జిల్లా ఏపీసిపిఈఎస్ కార్యదర్శి కుడుముల వెంకటరమణ, యుటిఎఫ్ మండల అధ్యక్షుడు శెట్టి రామకృష్ణ పాల్గొన్నారు.

అరకులోయ రూరల్: స్థానిక గ్రామ పంచాయతీ సర్పంచ్ పాడిబారికి జ్యోతి అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు.అనంతరం నూతనంగా ఏర్పాటు చేసిన సామాజిక సమావేశం మందిరం, డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించారు.ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి రాజు పాల్గొన్నారు.

చింతపల్లి:చింతపల్లి ప్రాంతీయ ఆసుపత్రిలో సూపరిండెంట్ ఇంద్ర ప్రియాంక ఆధ్వర్యంలో అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలవేసి ఘన నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు రుక్మిణి, బి.లావణ్య, నర్సింగ్ సూపరిండెంట్ ప్రభావతి, దంత వైద్యాధికారి ఎన్ మస్తాన్ వల్లి, ల్యాబ్ టెక్నీషియన్ సోమేశ్ పాల్గొన్నారు.

పెదబయలు: స్థానిక అంబేద్కర్ అభ్యుదయ సేవా సంఘం ఆధ్వర్యంలో మండల కేంద్రంలో భీమసుందర్ అధ్యక్షతన అంబేద్కర్ జయంతి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ పి మాధవరావు, ఎంపిటిసి కె.బొంజుబాబు, ఎంపీపీ బోండా వరహాలమ్మ, ఎంపీడీఓ పూర్ణయ్య, ఎస్ఐ కొల్లి రమణ పాల్గొన్నారు.

హుకుంపేట:హుకుంపేట, గన్నేరుపుట్టు పంచాయ తీలో డొంకిన వలసలో అంబేద్కర్ జయంతి వేడుకలను నిర్వహించారు. ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షులు టి క్రిష్ణారావు, గ్రామస్తులు ప్రభుత్వ ఉన్నత పాఠశాల నుండి అంబేద్కర్ విగ్రహ పార్కు వరకు భారీ ర్యాలీ ప్రదర్శన చేపట్టారు. మండల విద్యాశాఖ అధికారులు ఎస్ చెల్లయ్య, ఆదివాసీ గిరిజన సంఘం విశాఖపట్నం జిల్లా అధ్యక్షులు కే చిన్నం నాయుడు, అసిస్టెంట్ ప్రొఫెసర్ రామ ప్రసాద్, వైస్ ఎంపీపీ సుడిపల్లి కొండలరావు పాల్గొన్నారు.

దుంబ్రిగుడ: స్థానిక యూత్ ఆధ్వర్యంలో వివిధ ప్రజాసంఘాలు , ఉద్యోగులు అంబేద్కర్ చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో టిఎన్టియుసి అరకు పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి ఎం స్వామి, ఎంపీటీసీ ఎం సింహాద్రి, యుటిఎఫ్ జిల్లా నాయకులు ఎస్ కన్నయ్య పాల్గొన్నారు.

జిమాడుగుల:మండల కేంద్రంతో పాటు వాడవాడలా అంబేద్కర్ జయంతి ఘనంగా నిర్వహించారు. తహశీల్దార్ గిడ్డి రాజకుమార్, స్థానిక పోలీస్ స్టేషన్లో ఎస్సై షణ్ముఖరావు, మద్దిగరువు, నుర్మతిలో అంబేద్కర్‌కు నివాళు లర్పించారు.

రంపచోడవరం : రంపచోడవరంలో ఎమ్మెల్యే మిరియాల శిరీష విజయభాస్కర్ దంపతుల ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు కేకు కట్‌చేశారు. అంతకుముందు ఐటిడిఎ నుంచి అంబేద్కర్ సెంటర్ వరకు ర్యాలీ, అక్కడ మానవహారం నిర్మించారు. అంబేద్కర్ నూతన కాంస్య విగ్రహానికి తమవంతుగా రూ. 99,999 ఆర్థిక సహాయం అందిస్తామని ఎమ్మెల్యే శిరీష విజయభాస్కర్ దంపతులు ప్రకటించారు. కార్యక్రమంలో సబ్ కలెక్టర్ కల్పశ్రీ, తెలుగు యువత అధ్యక్షులు మఠం విజయభాస్కర్, సబ్ డిఎఫ్ఒ టి అనూష, తాసిల్దార్ రామకృష్ణ పాల్గొన్నారు.

ఐటిడిఎలో

ఐటిడిఎ సమావేశ మందిరంలో అంబేద్కర్ చిత్రపటానికి గిరిజన సంక్షేమ డిఇ చైతన్య నివాళు లర్పించారు.వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

గంగవరం,: పాత గంగవరం సెంటర్లో అంబేద్కర్ విగ్రహం వద్ద వాల్మీకి సంఘంగౌరవ అధ్యక్షులు వీరా వత్తుల ప్రసాద్ మాస్టర్ ఆధ్వర్యంలో అంబేద్కర్ జయంతి నిర్వహించారు. సర్పంచ్ కలుముల అక్కమ్మ, తహశీల్దార్ రామకృష్ణ, మాజీ ఎంపీపీ తీగల ప్రభ, సంఘ నాయకులు చిట్టిబాబు, శ్రీను, జనసేన మండల అధ్యక్షులు కుందన్ సిద్దు, ఉపాధ్యక్షులు రాజు, పాల్గొన్నారు.

విఆర్.పురం :మండలంలోని రేఖపల్లి ఎస్.సి.కాలనీలో అంబేద్కర్ విగ్రహానికి వైసిపి నాయకులు మాచర్ల గంగులు నివాళులర్పించారు. సిపిఎం మండల కార్యదర్శి పులి సంతోష్‌కుమార్ టిడిపి మాజీ జెడ్‌పిటిసి ముత్యాల రామారావు ఎస్.ఐ.సంతోష్,కుమార్, ఎఎస్‌డిఎస్.సంస్థ డైరెక్టర్ గాంధీబాబు, బొర్రా నరసింహారావు, చీమల కృష్ణార్జునరావు, చీమల సంతోష్, చీమల రంజిత్, మాచర్ల రుషి, వరకా రాజేంద్ర, మాచర్ల రాజు, మాచర్ల నరేష్, మాచర్ల కేశవ్, పెరమాళ వేణు, మేడిపల్లి అరవింద్, పెడపట్లఆనంద్, పెడపట్ల దుర్గారావు, నూనె నాగు,అక్కోజు లక్ష్మి పాల్గొన్నారు.

రంపచోడవరం : స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిపి బంధం శ్రీదేవి, ఎంపిడిఒ సుండం శ్రీనివాసు దొర ఆధ్వర్యంలో అంబేద్కర్‌కు నివాళులర్పించారు. జెడ్‌పిటిసి పండా వెంకటలక్ష్మి, కార్యాలయం పరిపాలన అధికారి పి జయంతి, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

సీలేరు: స్థానిక పోస్టాఫీస్ దరి అంబేద్కర్ విగ్రహానికి విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ క్యాంప్ కార్యాలయం ఒఎస్‌డి కెవి సాంబశివరావు, జెన్‌కో సీలేరు కాంప్లెక్స్ చీఫ్ ఇంజనీర్ వాసుదేవరావు ఎస్సీ సివిల్స్ చంద్రశేఖర్ రెడ్డి, ఇఇ విల్ శ్రీనివాసరెడ్డి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల గ్రౌండ్‌లో జయంతిసభ నిర్వహిచారు. జెన్కో సబ్ ఇంజనీరు శ్రీధర్ గీతాన్ని ఆలపించారు. కార్యక్రమంలో పలువురు ఇంజనీర్లు ఏపీ జెన్కో ఎస్ ఈ సివిల్ కార్యాలయ సిబ్బంది ఎస్టి ఎస్సి అసోసియేషన్ నాయకులు ఏపీ జెన్కో కార్మికులు ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

రాజవొమ్మంగి : రాజవొమ్మంగిలో ఎంపిపి గోము వెంకటలక్ష్మి, సిఐ ఎన్ సన్యాసినాయుడు, పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు, ఎంఆర్‌పిఎస్ జిల్లా అధ్యక్షుడు మార్త బుజ్జిబాబు అంబేద్కర్‌కు నివాళులర్పించారు.కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకులు, తెలుగుదేశం మండల అధ్యక్షుడు పెద్దిరాజు, జనసేన మండల అధ్యక్షులు భోగిరెడ్డి త్రిమూర్తులు, పాల్గొన్నారు.

సిపిఎం, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో...



రంపచోడవరంలో సిఐటియు ఆధ్వర్యాన....

ఎటపాక:: మండలంలోని తోటపల్లి గ్రామంలో అంబేద్కర్ విగ్రహానికి సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు ఐ.వి., పార్టీ మండల కార్యదర్శి అర్జున్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఐవి. మాట్లాడుతూ అంబేద్కర్ అందించిన ప్రజాస్వామ్య హక్కులను కాలరాస్తూ, భారత రాజ్యాంగాన్ని మార్చి, సనాతన ధర్మాన్ని, మనుధర్మ శాస్త్రాన్ని ప్రజలపై రుద్దాలన్న బిజెపి కుట్రలను తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు .ప్రజాస్వామ్య హక్కులు కాపాడటానికి సిపిఎం చేస్తున్న పోరాటాల్లో ప్రజలంతా కలిసి రావాలని ఐ.వి. పిలుపునిచ్చారు.కార్యక్రమంలో పార్టీ మండల కమిటీ సభ్యులు జి.హుస్సేన్, సవలం రాము, స్థానిక పెద్దలు కంపాటి చిన్న వెంకన్న, మాజీ సర్పంచ్ సుకునాయక్,ఉపసర్పంచ్ జి.మణి, ముక్కోటేశ్వరావు పాల్గొన్నారు.

విఆర్ పురం: మండలం రేఖపల్లి సిపిఎంకార్యాలయంలో అంబేద్కర్ చిత్రపటానికి మాజీ ఎమ్మెల్యే కుంజా.బొజ్జి కుమారుడు సిపిఎం సీనియర్ నాయకులు కుంజా.నాగిరెడ్డి పూలమాలవేశారు, పార్టీ మండల కార్యదర్శి పులి సంతోష్‌కుమార్, మండల నాయకులు పంకు. సత్తిబాబు పోడియం శ్రీరామ్ మూర్తి శ్రీరపు తాతబాబు సోడి. మల్లయ్య, రవి, సిహెచ్ సుబ్బారావు పాల్గొన్నారు.

రంపచోడవరం స్థానిక అంబేద్కర్ సెంటర్‌లో అంబేద్కర్ విగ్రహానికి సిఐటియు జిల్లా కార్యదర్శి వల్లపు వెంకట్, సిఐటియు జిల్లా అధ్యక్షులు మట్ల వాణిశ్రీ, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు కంభం శాంతి రాజు, ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా అధ్యక్షులు ఈతపల్లి సిరిమల్లె రెడ్డి, జిల్లా కమిటీ సభ్యులు కారం రామలక్ష్మి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా సిఐటియు కార్యదర్శి వల్లపు వెంకట్ మాట్లాడుతూ పీడిత ప్రజల అభ్యున్నతికి అంబేద్కర్ రాజ్యాంగాన్ని రూపొందిస్తే, ప్రస్తుతం కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం దాన్ని తూట్లు పొడిచే విధంగా వ్యవహరిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. లేబర్‌కోడ్‌ల రద్దుకు ఈనెల 20న దేశవ్యాప్త ఆందోళనలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.

కూనవరం : సిపిఎం కార్యాలయంలో అంబేద్కర్ చిత్రపటానికి నానుపల్లి వెంకటేశ్వరావు పూల మాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం కర్నాటి శ్రీనివాసరావు అధ్యక్షతన అంబేద్కర్ జయంతిలో పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు సున్నం రాజులు మాట్లాడుతూ రాజ్యాంగంలో పొందుపరిచిన సూత్రాల మేరకు ప్రజలకు న్యాయం చేయడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని మండిపడ్డారు. పోలవరం నిర్వాసితుల గోడు పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు జిల్లా కమిటీ సభ్యులు మేకల నాగేశ్వరావు,పాయం సీతారామయ్య,తాళ్లూరి శ్రీనివాసరావు, సర్పంచ్ బొగ్గా వెంకమ్మ, శంకర్,ఎంపీటీసీ జయసుధ, అమ్మాజి,పాయం సత్యనారాయణ, నస్కూరి ధర్మయ్య, గడ్డిపాటి షణ్ముఖేశ్వరరావు, సుధారాణి, కారం కన్నారావు,సుమన్, తమ్మయ్య పాల్గొన్నారు.

రాజవొమ్మంగి : ఒబువారిపాలెంలో ఆదివాసి గిరిజన సంఘం, ఎంఆర్‌పిఎస్ ఆధ్వర్యంలో అంబేద్కర్ చిత్రపటానికి ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు లోతా రామారావు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆదివాసీ నేతలు వంతు బాలకృష్ణ, వజ్రపు అప్పారావు,సింగిరెడ్డి అచ్చారావు పాల్గొన్నారు.

చింతూరు :చింతూరు దళిత కుటుంబం సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో లాడే శ్రీనివాసరావు అధ్యక్షతన అంబేద్కర్‌కు నివాళు లర్పించారు. సిపిఎం నాయకులు ఎర్రంశెట్టి శ్రీనివాసరావు, సంఘం అధ్యక్షులు కుమార్,నాగేంద్ర, గ్రామీణ వైద్యులు సాగర్,పసుపులేటి సాల్మాన్ రాజు,నక్కా రజని కుమార్,గుండెపోగు శ్రీనివాసరావు, భాస్కర స్కూల్ కరస్పండెంట్ చీరసాని వేణు గోపాల్,ఊబా హరవింద్, చిడుమూరు ఏరియా కో -ఆర్డినేటర్ కట్టా శ్రీనివాసరావు,ే ంపాక ఏరియా కో-ఆర్డినేటర్ మాచర్ల వెంకన్నబాబు, గ్రామీణ వైద్యులు గుబ్బల ఆనంద్ పాల్గొన్నారు.

కొయ్యూరు: స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో అంబేద్కర్ విగ్రహానికి నర్సి పాపారావు, ఆదివాసి గిరిజన సంఘం జిల్లా అధ్యక్షులు సర్ముర్తి సూరిబాబు, దుమంతి రామకృష్ణ, ప్రసాద్ పూలమాలవేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పలువురు విద్యార్థులు పాల్గొన్నారు


పాలాభిషేకం చేస్తున్న చిన్నయ్య పడాల్, తదితరులు



సదస్సులో మాట్లాడుతున్న పద్మ, వేదికపై డాక్టర్ బి.గంగారావు

అమెరికా పెంచిన సుంకాలతో..
భారత ఆర్థిక వ్యవస్థకు ప్రమాదం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ఇటీవల అమెరికా పెంచిన సుంకాలతో భారత ఆర్థిక వ్యవస్థకు రానున్న రోజుల్లో ప్రమాదం ఏర్పడనుందని ప్రముఖ అర్థ శాస్త్ర ఆచార్యులు డాక్టర్ కె.పద్మ అన్నారు. అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో సోమవారం సాయంత్రం 'ట్రంప్ వాణిజ్య యుద్ధం - భారత్‌పై ప్రభావం' అన్న అంశంపై సదస్సు నిర్వహించారు. అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రం నిర్వహణ కమిటీ సభ్యులు కామేశ్వరరావు అధ్యక్షతన ఈ సదస్సు సాగింది. దీనికి ముఖ్య వక్తగా హాజరైన పద్మ మాట్లాడుతూ ప్రస్తుతం అమెరికా అనుసరిస్తున్న విధానాలకు కారణాలను తెలియజేశారు. ట్రంప్ తాజా నిర్ణయాలతో ఉద్యోగ భద్రతకు ప్రమాదం ఏర్పడనుందన్నారు. ప్రస్తుతం దేశాల మధ్య ఉన్న అంతరాల కారణంగా సుంకాల విధింపు ప్రారంభమైందని తెలిపారు. ఇటీవల అమెరికా పెంచిన సుంకాల ద్వారా స్టాక్ మార్కెట్లు పతనమై అమెరికా ఆర్థిక వ్యవస్థ పూర్తిగా దెబ్బతిందన్నారు. సుంకాల పెంపు ద్వారా వాటిల్లే నష్టాలను తెలియజేశారు. సుంకాలు ఇలానే కొనసాగితే భారతదేశంలోని ఒక్క ఆక్వా రంగంలోనే 50 లక్షల మంది ఉపాధి కోల్పోయే ప్రమాదం ఉందని, ఎంఎస్‌ఎంఇ పరిశ్రమ తీవ్ర సంక్షోభంలోకి వెళుతుందని అన్నారు. మరో వక్త అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రం కార్యదర్శి డాక్టర్ బి.గంగారావు మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా అమెరికాకు దిగుమతి అవుతున్న వస్తువులపై సుంకాలను పెంచి ఆయా దేశాల ఆర్థిక వ్యవస్థలను విచ్ఛిన్నం చేసేందుకు ట్రంప్ పన్నాగం పన్నారన్నారు. ముఖ్యంగా భారతదేశం నుంచి అమెరికాకు ఎగుమతి అయ్యేటటువంటి వస్తువులపై 35 శాతం ఎగుమతి సుంకాన్ని పెంచారని, తద్వారా భారతీయ వస్తువులను అమెరికా మార్కెట్లోకి రాకుండా చూస్తున్నారని తెలిపారు. భారత ప్రభుత్వం అమెరికాకు లొంగిపోయి దేశ ప్రయోజనాలను తాకట్టు పెట్టిందన్నారు. దేశ ఆర్థిక వ్యవస్థను విచ్ఛిన్నం చేసే విధంగా కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం వ్యవహరిస్తోందని దుయ్యబట్టారు.

19 కిలోల గంజాయి స్వాధీనం

ప్రజాశక్తి-జి.మాడుగుల: మండలంలో కొత్తూరు జంక్షన్ వద్ద పోలీసులు సోమవారం వాహన తనిఖీలు నిర్వహించారు. ద్విచక్ర వాహనాన్ని ఆపి తనిఖీ చేయగా గోనే సంచిలో ఉన్న 19 కిలోల ఎండు గంజాయిని, ఇద్దరు నిందితులను అదుపులోకి తీసుకున్నట్టు స్థానిక ఎస్సై షణ్ముఖరావు విలేకరులకు తెలిపారు. ఆయన అందించిన వివరాలు ఇలా ఉన్నాయి. పట్టుబడిన నిందితులు గేమిలి వెంకట్రావు, గేమిలి సంతోష్‌లపై కేసు నమోదు చేసి రిమాండ్ కు తరలించినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు

ఎమ్మెల్సీని కలిసిన పిఆర్‌టియు నేతలు

ప్రజాశక్తి-దుంబ్రిగుడ:నూతనంగా ఎన్నికైన ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులు నాయుడును సోమవారం అల్లూరి జిల్లా పిఆర్టియు అల్లూరి జిల్లా అధ్యక్షుడు ఎస్ అప్పలరాజు, జిల్లా నాయకులు ఎం శ్రీనివాస్, మండల అధ్యక్షుడు లక్ష్మయ్య మర్యాద పూర్వకంగా కలిశారు ఈ సందర్భంగా ఆయనకు బొకేను అందజేసి, సాలువతో సన్మానించారు. ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని ప్రభుత్వంపై ఒత్తిడి చేయాలని కోరారు.

విశాఖ పోర్టును సందర్శించిన అమెరికా బృందం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : విశాఖపట్నం పోర్టును అమెరికా ప్రతినిధి బృందం శనివారం సందర్శించింది. యునైటెడ్ స్టేట్స్ నేవీ కెప్టెన్ అలన్ ఎం.బేకర్ నేతృత్వంలో వచ్చిన అమెరికా ప్రతినిధి బృందానికి పోర్ట్ డిప్యూటీ ఛైర్మన్ దుర్గేశ్ కుమార్ దూబే స్వాగతం పలికారు. అనంతరం విశాఖపట్నం పోర్టులో అందుబాటులో ఉన్న విభిన్న మౌలిక సదుపాయాలు, కార్గో నిర్వహణ సామర్థ్యాలను తెలియజేశారు.

ఏడాదిగా ఎదురుచూపు


డిఎల్.పురంలో ఒడ్డుకు చేరిన బోట్లు

- మత్స్యకారులకు నేటికీ పరిహారం ఇవ్వని కూటమి ప్రభుత్వం
- నేటి నుంచి మళ్లీ చేపల వేట నిషేధం
- ఒడ్డుకే పరిమితం కానున్న బోట్లు

ప్రజాశక్తి - అనకాపల్లి ప్రతినిధి

ఏడాదవుతున్నా సముద్రంలో చేపల వేట నిషేధ కాలపు పరిహారాన్ని మత్స్యకారులకు కూటమి ప్రభుత్వం ఇవ్వలేదు. గత సంవత్సరపు పరిహారం ఇవ్వకముందే మంగళవారం నుంచి మళ్లీ వేట నిషేధం అమల్లోకి రానుంది. ఏప్రిల్ 15 నుంచి జూన్ 14 వరకు 61 రోజుల పాటు సముద్రంలో వేటను నిషేధిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. మెకనైజ్డ్, మోటార్ బోట్లలో చేపల వేటను నిషేధించిన ప్రభుత్వం ఆ కాలంలో మత్స్యకారుల జీవనోపాధి విషయాన్ని పట్టించుకోవడంలేదు. నిషేధపు రోజుల్లో వేటకు వెళ్లిన వారికి జరిమానా విధించడంతో పాటు డీజిల్, ఇతర సౌకర్యాలను నిలుపుదల చేయనున్నట్లు ప్రకటించింది. చేపల వేట మినహా ఇతర జీవనాధారంలేని మత్స్యకారులకు పరిహారం ఇవ్వకపోతే ఎలా వారి కుటుంబాలు బతుకుతాయని ఆలోచించడంలేదు. గత ప్రభుత్వం అర్హత కలిగిన మత్స్యకారులకు పది వేలు చొప్పున బ్యాంకు ఖాతాలో జమచేసింది. అధికారంలోకి వస్తే వేట నిషేధ కాల పరిహారం రూ.20 వేలకు పెంచుతామని ఎన్నికల్లో చంద్రబాబు హామీ ఇచ్చారు. కానీ ఇంతవరకూ మత్స్యకారులకు పరిహారం చెల్లించకపోవడంతో గతేడాది వేట నిషేధపు రోజుల్లో చేసిన అప్పులు ఈనాటికీ మత్స్యకారులు తీర్చుకోలేకపోయారు. బ్యాంకులు, వ్యాపారులు వద్ద తనఖా పెట్టిన బంగారం విడిపించుకోలేకపోయారు.

జిల్లాలో 73 కిలోమీటర్ల సముద్ర తీరంలో 28 మత్స్యకార గ్రామాలున్నాయి. పరవాడ, అచ్యుతాపురం, రాంబిల్లి, ఎస్.రాయవరం, నక్కపల్లి, పాయకరావుపేట మండలాల్లో 71,784 మంది మత్స్యకారులున్నారు. 2,360 బోట్లలో 14,160 మంది మత్స్యకారులు సముద్రంలో చేపల వేటకు వెళ్తున్నట్లు మత్స్యశాఖాధికారులు గుర్తించారు. గతేడాది వేటకు వెళ్లిన 12,996 మందిలో పరిహారానికి అర్హులుగా 10,750 మందిని గుర్తించి ప్రభుత్వానికి జాబితాను నివేదించారు. ఏ ఒక్కరికీ పరిహారం ప్రభుత్వం చెల్లించలేదు. గతం కంటే చేపల వేటకు వెళ్లిన వారి సంఖ్య ఈ ఏడాది పెరిగింది. అర్హులను గుర్తించేటప్పుడు వేటకు వెళ్లిన వారిలో ఎంతమందిని అర్హులుగా గుర్తించి, ఎంతమంది పరిహారానికి దూరం చేస్తుందో ప్రభుత్వం విధించబోయే నిబంధనలను బట్టి ఆధారపడివుంటుంది. వేట నిషేధ కాలంలో మత్స్యకారులకు జీవన భృతి కింద పరిహారం ఇవ్వడం ప్రభుత్వాల విధి. కానీ ప్రభుత్వం ఆ పరిహారం చెల్లింపులో అనేక ఆంక్షలు పెట్టి, వేటకు వెళ్లిన వారి సంఖ్యను తగ్గించేలా నియమ నిబంధనలు రూపొందించి, చివరకు పరిహారమే ఇవ్వని పరిస్థితి వుంది.

సముద్రంలో చేపల వేటకు వెళ్తున్న మత్స్యకార గ్రామాలు: అచ్యుతాపురం మండలంలో తంతడివాడపాలెం, పూడిమడక, కొండపాలెం, పరవాడ మండలంలో మత్యాలమ్మపాలెం, తిక్కవానిపాలెం, రాంబిల్లి మండలంలో వెంకయ్యపాలెం, ఆర్.వాడపాలెం, వాడనర్సాపురం, కొత్తపట్నం, ఎస్.రాయవరం మండలంలో బంగారమ్మపాలెం, రేవుపోలవరం, కొత్తరేవుపోలవరం, నక్కపల్లి మండలంలో డిఎల్.పురం, చినతీనార్ల, దొండవాక, రాజయ్యపేట, బోయపాడు, అమలాపురం, పెదతీనార్ల, బంగారమ్మపేట, పాయకరావుపేట మండలంలో పెంటకోట, రాజవరం, గజపతినగరం, రత్నమయ్యపేట, వెంకటనగరం, రాజానగరం.

స్వయం ఉపాధి పథకాలకు దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : విశాఖపట్నం జిల్లా షెడ్యూల్డ్, కులాల సేవా సహకార సంస్థ 2025-26 ఆర్థిక సంవత్సరానికిగాను ఎస్‌సి నిరుద్యోగ యువతకు రూ.16.88 కోట్ల విలువగల 32 రకాల వివిధ స్వయం ఉపాధి పథకాలను అమలు చేసేందుకు ఆమోదం తెలిపిందని విశాఖ జిల్లా కలెక్టర్ ఎంఎన్.హరేంధిర ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పథకాలకు ఈ నెల 14 నుంచి మే 10వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. దరఖాస్తు చేసే అభ్యర్థుల వయస్సు 21 నుంచి 50 సంవత్సరాలలోపు ఉండాలని పేర్కొన్నారు. ఆధార్ కార్డు, పాన్ కార్డు, తెల్ల రేషన్ కార్డు, కుల ధ్రువీకరణ పత్రం కలిగి ఉండాలన్నారు. ట్రాన్స్‌పోర్టు సెక్టార్‌కు దరఖాస్తు చేసుకున్న వారికి డ్రైవింగ్ లైసెన్స్ అవసరమని తెలిపారు. జిల్లాలో మొత్తం 406 యూనిట్లకుగాను రూ.16.88 కోట్లను మంజూరు చేసినట్టు వెల్లడించారు. అందులో రూ.6.68 కోట్లు సబ్సిడీగానూ, బ్యాంకు లోను రూ.9.35 కోట్లుగానూ, లబ్ధిదారుని వాటా రూ.0.84 కోట్లుగానూ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. అందులో కనిష్టం రూ.లక్ష నుండి గరిష్టంగా రూ.4 లక్షల వరకు సబ్సిడీతో కూడిన ఐఎస్‌బి సెక్టార్, ట్రాన్స్‌పోర్టు సెక్టార్ అగ్రికల్చర్ సెక్టార్ పథకాలకు రుణాలు మంజూరు చేయనున్నట్టు పేర్కొన్నారు.

ఈ స్వయం ఉపాధి పథకంలో ఫ్లవర్ బొకే మేకింగ్, డెకరేషన్, వర్మీ కంపోస్టింగ్, ఆర్గానిక్ మాన్యుర్, వెబ్‌సైట్ డెవలప్మెంట్, ఐటి సర్వీసెస్, ఎల్ఇడి బల్బ్, ఎనర్జీ సేవింగ్, డివైజ్ అసెంబ్లింగ్, ప్లంబింగ్, ఎలక్ట్రిషియన్ సర్వీసెస్, వాటర్ బాటిల్ రీఫిల్, ప్యూరిఫికేషన్ కియోస్క్, వాటర్ రీసైక్లింగ్, అప్ సైక్లింగ్ బిజినెస్, మొబైల్ రిపేరింగ్, ఎలక్ట్రానిక్ సర్వీసెస్, సోప్, డిటర్జెంట్, మేకింగ్, ఫిష్ ఫార్మింగ్ (అగ్రికల్చర్), అడ్వెంచర్ టూరిజం, మొబైల్ కార్ వాష్ అండ్ సర్వీస్, బేకరీ అండ్ కన్ఫెక్షనరీ యూనిట్, బ్రిక్లిన్, ఫ్లైయాష్ బ్రిక్ ప్రొడక్షన్, సిల్క్ ప్రొడక్షన్, వాటర్ ప్యూరిఫికేషన్, వెల్డింగ్, ఫ్యాబ్రికేషన్ యూనిట్, జుట్ బ్యాగ్, ఇకో - ఫ్రెండ్లీ ప్రొడక్ట్ మేకింగ్, సోలార్ ఎనర్జీ ప్రోడక్ట్ సేల్స్, ఇన్ఫలేషన్, సోలార్ ప్యానల్ అసెంబ్లింగ్, ఇన్ఫలేషన్, కాయిర్ ప్రోడక్ట్ మ్యానుఫ్యాక్చరింగ్, ఫొటోగ్రఫీ అండ్ వీడియోగ్రఫీ, ఆయుర్వేదిక్ క్లినిక్, జెనరిక్ మెడికల్ షాప్, బ్యూటీ పార్లర్, మెడికల్ ల్యాబ్, ఇవి బ్యాటరీ ఛార్జింగ్ యూనిట్, పాసింజర్ ఆటో (3 వీలర్- (ఇ-ఆటో)), పాసింజర్ ఆటో (4 వీలర్), ప్యాసింజర్ కార్స్ (4 వీలర్), గూడ్స్ ట్రక్, డ్రోన్స్‌ఫర్ అగ్రికల్చర్ పర్పస్ (గ్రూప్ అక్టివిటీ) మొదలగు వాటికి రుణాలు మంజూరు చేయనున్నట్టు తెలిపారు. వీటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.


అన్నసమారాధనలో పాల్గొన్న ప్రజలు

ఘనంగా అయ్యప్పస్వామి ఆలయ వార్షికోత్సవం

ప్రజాశక్తి - సీలేరు: సీలేరు అయ్యప్ప స్వామి పదవ వార్షికోత్సవాన్ని సోమవారం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. అయ్యప్ప స్వామి ఆలయంలో అభిషేకాలు, హోమాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం భారీ అన్నసమారాధన నిర్వహించారు. సాయంత్రం 6 గంటలకు ఆలయ ప్రాంగణంలో బొబ్బిలికి చెందిన కెవిఎస్ కళ్యాణ గురుస్వామి ఆధ్వర్యంలో పడిపూజ నిర్వహించారు. అధికసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

నేటి నుండి దోమల నివారిణి పిచికారీ

ప్రజాశక్తి - రంపచోడవరం : మండలంలో ఈనెల 15 నుంచి పలు గ్రామాలలో మలేరియా టైఫాయిడ్ చికెన్ గున్యా, డెంగీ, బోధకాలు, మొదలగు వ్యాధులు వ్యాప్తికి కారణమైన దోమల నివారణకు మందులు పిచికారీ చేయనున్నట్లు ఎంపిడిం ఎస్. శ్రీనివాస్ దొర తెలిపారు. మూడు టీములుగా గ్రామాలలో పర్యటించి దోమల నివారిణి పిచికారీ చేస్తారని ప్రజలంతా సహకరించాలని కోరారు. మంగళవారం మొదటి రోజున నరసాపురం పరిధిలో ఈతలపాడు, ఆకురు పంచాయతీ పరిధిలో గ్రామాలు నర్సాపురం పరిధిలో గ్రామాలు వాడపల్లి పరిధిలో నిమ్మలపాలెం గ్రామాలలో దోమల నివారిణి పిచికారీ చేస్తారన్నారు. ఆయా పంచాయతీల కార్యదర్శులు దీనిపై బాధ్యత వహించి, ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు.

వ్యక్తి దారుణ హత్య

ప్రజాశక్తి-అరకులోయరూరల్:అల్లూరి జిల్లా అరకులోయ మండలం గన్నెల పంచాయతీ డప్పుగుడ గ్రామంలో గడబంటు భీమన్న (46) అనే వ్యక్తి హత్యకు గురైన ఘటన సోమవారం ఉదయం చోటుచేసుకుంది. చిట్టిపురి పొల్లు కత్తితో దారుణంగా హత్య చేసి తనకు తానే అరకులోయ పోలీస్ స్టేషన్కు వెళ్లి లొంగి పోయినట్లు స్థానికులు తెలిపారు. విషయం తెలుసుకున్న అల్లూరి జిల్లా పాడేరు డీఎస్పీ షేక్ షాహబాద్ అహ్మద్ డప్పుగూడ గ్రామానికి చేరుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. ఆర్థిక కారణాలతో హత్య జరిగినట్లు తెలిసిందని ఇంకా పూర్తి వివరాలు తెలియాల్సిందన్నారు. ఈ హత్య కేసులో ఇంకెవరైనా ఉంటే వారిని కూడా అరెస్ట్ చేస్తామని తెలిపారు .

వక్ఫ్ సవరణలను వ్యతిరేకిస్తూ నేడు రౌండ్ టేబుల్ సమావేశం

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : వక్ఫ్ చట్ట సవరణలకు వ్యతిరేకంగా ఆవాజ్ విశాఖ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం డాబాగార్డెన్స్‌లోని అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రంలో ఉదయం 10 గంటలకు రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహిస్తున్నట్లు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎఎ.ఆష్రఫ్ తెలిపారు. సోమవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ వక్ఫ్ సవరణ బిల్లును పార్లమెంట్ ఆమోదించడాన్ని తమ సంఘం తీవ్రంగా వ్యతిరేకిస్తోందన్నారు. కొత్త వక్ఫ్ సవరణ చట్టం తేవడం ద్వారా రాజ్యాంగంపైనా, మైనారిటీల హక్కులపైనా కేంద్రం దాడి చేస్తోందన్నారు.

దేశ లౌకిక కూర్పును దెబ్బతీస్తూ మతపరంగా చీలికలను పెంచుతున్న ఈ చట్టానికి వ్యతిరేకంగా ఆవాజ్ పోరాటం చేయనుందన్నారు. మంగళవారం జరిగే రౌండ్ టేబుల్ సమావేశంలో ప్రజా సంఘాలు నాయకులు, మేధావులు, విద్యావంతులు, యువకులు, ముస్లిం మత పెద్దలు పాల్గొని జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు. మీడియా సమావేశంలో సంఘం జిల్లా అధ్యక్షులు ఎమ్‌డి అయుబ్, జిల్లా నాయకులు అబ్దుల్ మునీర్ మునుషా, కెయుజెడ్.ఖాన్ పాల్గొన్నారు.